# ప్రతీకారం

పి.జయనారాయణ

''విజయ్! నేను వట్టి మనిషిని కాను...''

''అవునని ఎవరన్నారు? నీవు గట్టిదానివే! నాకు తెలీదా! నీ ప్రేమకొరకై నేను పడ్డ పాట్లు! ఆ మహా కష్టాలు ఎలా మర్చిపోగలను?'' అన్నాడు ఓ మాదిరిగా నవ్వుతూ.

''నీకెప్పుడూ వేళాకోళమేనా? నేను క్యారీయింగ్ విజయ్! ట్రై టు అండర్‌స్టాండ్ టుమీ!'' అంది వేడుకోలుగా సారిక.

''నన్నేం చేయమంటావ్ రిక్కీ! ఇంత చిన్న ప్రాబ్లంకే అంతలా ఇదవుతావేం... జస్ట్ గెట్ రిడ్ ఆఫ్ ఇట్!'' అన్నాడు విజయ్ అదేం పెద్ద సమస్య కాదన్నట్టు.

సారిక అదిరిపడ్డది! పిచ్చిదానిలా విజయ్‌ని చూస్తూ అన్నది, ''విజయ్ నిన్నే నమ్ముకున్న దాన్ని! ఎన్నెన్ని వాగ్దానాలు చేశావ్? మన పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పుడల్లా— 'ఇదిగో— అదిగో' అంటూ దాటేశావు. మా డాడీ స్టేట్స్‌నుండి రావాలన్నావు. మీ డాడీ వచ్చేశాడు కదా! ఇంకా ఆలస్యం దేనికి? మన పెళ్ళి ఎంత త్వరగా జరిగితే అంత మంచది విజయ్. లేకపోతే అలా జరక్కపోతే...'' అంటూ ఏడ్చింది సారిక. విజయ్ సారికను ఓదార్చక పోగా లేచి నిలబడి సిగరెట్ వెలిగించాడు. పొగ రింగులు... రింగులుగా వదులుతూ అన్నాడు. ''చూడు రిక్కీ— నీతో పెళ్ళి మా డాడీకేమాత్రం ఇష్టముండదు! ఆయన ప్రాణం డబ్బు, పరువు సోషల్ స్టేటస్‌తో ముడిపడి వున్నాయి. ఈ మూడింటిలోనే ఆయన ప్రాణం వుంది. అవెలాగూ నీకు లేవు. సో! మన పెళ్ళి అవుటాఫ్ క్వశ్చన్. కాబట్టి జస్ట్ ఫర్ గెట్! అంట్ గెట్ రిడాఫ్ ఇట్!'' అని తేలిగ్గా అన్నాడు విజయ్.

సారిక నేల చూపులు చూస్తూ కూర్చుంది. విజయ్ అన్నాడు.

''అయినా రిక్కీ కడుపొచ్చిందని ఏడుస్తూ కూర్చోడం కంటే యూరోపియన్స్‌లా అబార్షన్ వేసుకుని హాయిగా జీవితం గడిపేయక కొంపలంటుకు పోయిన దానిలా బాధపడ్తావేం? ఛ! నువ్వేకాదు. స్పందన, శిల్ప, నస్రీన్, రాధ, రోజా, వాళ్ళతో పాటు మరో పదహారు మందీ అంతా కడుపొచ్చిందని ఏడ్చారు. కాని ఒక్కరంటే ఒక్కరు సింపుల్‌గా తీసుకున్న పాపాన పోలేదు! షిట్! బ్లడీ ఇండియన్ కల్చర్! అంటూ సిగరెట్ కసిగా విసిరి పారేశాడు! సారిక చివ్వున తలెత్తి చూసింది! వాడ్ని నమ్మి తనింత పని చేసింది'' అని అనుకుంది.

మరో సిగరెట్ వెలిగించి అన్నాడు— ''లుక్ రిక్కీ! జీవితం మూణ్ణాళ్ళ ముచ్చట! పుట్టుకకీ, చావుకీ ఉన్న జీవితం ఓ చిన్న బిందువు మాత్రమే. ఇంత చిన్న బ్రతుకు బ్రతకడానికే ఇన్ని ఏడ్పులు అర్పులా? వుయ్ ఎంజాయ్ ఇట్! దట్సాల్! సో! బీ ఫీర్‌ఫుల్! ఎండ్ గెట్ రిలీఫ్ ఇట్. పద వెళ్దామంటూ'' తన మారుతీ కారు వైపు దారి తీసాడు విజయ్. సారిక కదలక పోవడంతో విజయ్ భుజాలెగరేసి వెళ్ళిపోయాడు. కాలేజీ ఆవరణంలో ఉన్న పార్క్‌లో విజయ్ వెళ్ళి పోయాక కూడా ఇంకా అలాగే ఆలోచిస్తూ కూర్చుండి పోయింది సారిక.

ఎక్కడో మారు మూలనున్న పల్లెనుండి చదువు కోవడానికని సిటీకి వచ్చి తను చేసిన నిర్వాకమిదా? ఊర్లో ఉన్న తల్లిదండ్రులకి తెలిస్తే గుండాగి ఛస్తారు. ఎలాగూ అక్కయ్య కాళ్ళు పట్టుకొని ఉన్నదున్నట్టు చెప్పేసి తననీ గండం నుంచి గట్టెక్కించమంటే ముందు నాల్గు తన్ని, తాము ఏడ్చి వాళ్ళు తనకి చెప్పి ఎలాగోలా కాపాడుతుంది! కాని బయట ప్రపంచం మాటేంటి? ఈ విషయం కాలేజీలో తెలిస్తే తన పేరు, తను చేసిన నిర్వాకం గోడల మీదకెక్కదూ? రేపు రాగానే ఈ విజయ్ రాస్కెల్ కాలేజీ మొత్తం పబ్లిసిటీ ఇవ్వడూ? అసలు తనలాంటి వాళ్ళు ఈ సొసైటీలో తలెత్తుకోగలరా? ఈ విషయం తెల్సి తనని పరువుగా బ్రతకనిస్తుందా ఈ సొసైటీ? ఎంతసేపలా కూర్చుందో తనకే తెలియదు.

ఏడ్చి ఏడ్చి కళ్ళుబ్బి వున్నాయి! చేసిన పాపానికి ఏడుస్తూ కూర్చోడం కంటే చేసేదేం లేదికని నిర్ధారించుకుంది సారిక.

మరుసటి రోజు తను అనుకున్నంత పని చేసాడు విజయ్. కాలేజీలో అతని స్నేహితులంతా తనవైపో మాదరిగా చూస్తూ వెకిలి చేష్టలతో తననేడిపించడం మొదలు పెట్టారు. రాను రాను వాళ్ళ ఆగడం శృతి మించింది'' వాళ్ళని తాను చావ కొట్టినా లాభం లేకపోయింది. పైగా వారింకా రెచ్చిపోయారు. వీళ్ళని ఎలా ఎదుర్కోవాలో తెలియక సతమతమై కుమిలి పోసాగింది సారిక!

ఒక రోజులాగే విజయ్ స్నేహితులు తనెంటపడి ఏడిపిస్తుంటే తన సీనియర్ అయిన శ్వేత ఆదుకొంది. శ్వేత ఓ పంజాబీ అమ్మాయి అయినా, గుంటూరులో పుట్టడం మూలాన స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతుంది. చూడ్డానికి సైతం స్వచ్ఛమైన తెలుగు అమ్మాయిలానే వుంటుంది. ఆ సమయంలో సారిక శ్వేతని పట్టుకుని ఏడ్చేసింది. శ్వేత ఓదారుస్తూ అంది, ఇలాంటి రాస్కెల్స్‌ని ధైర్యంగా ఎదుర్కోనాలి కాని అలా ఏడుస్తారా? పద! అలా కాంటీన్‌కెళ్ళి నా హాస్టల్ రూం కెళ్ళదాం'' అంది శ్వేత.

''నా పేరు సారిక! చదువుకోవాలన్న ఆశతో

సిటీకొచ్చి అక్కయ్య వాళ్ళింట్లో వున్నాను. కానీ నా దురదృష్టం కొద్దీ ఈ విజయ్ వలలో పడి చిక్కుకున్నాను. ఇప్పుడు నా పరిస్థితి... అం టూ మళ్ళీ కంట తడి పెట్టింది సారిక!

"ఓహ్! ఇదన్న మాట! అసలెలా జరిగింది?" అడిగింది శ్వేత.

"మొదట వాడే నా వెంట పడ్డాడు. నేను అసలు పట్టించుకోలేదు! నేను లేందే ఉండలేనని



ఎన్నో విధాల చెప్పిచూశాడు. అయినా నేనేమాత్రం చలించలేదు. కాలేజీ చదువు ఇల్లు తప్పించి నా మనసులో ఇంకేమీ లేకుండేది! ఒకరోజు కాలేజీ టెర్రస్‌పై చదువుకుంటున్నాంటే "సారిక గారు నాకు డబ్బుంది. అంతస్థుంది కాని ఏం లాభం? అన్నీ ఉన్నా మనసులో మాత్రం అశాంతే మిగిలింది! ఒక్కరంటే ఒక్కరు నన్ను నన్నుగా ఇష్టపడి ప్రేమించే వాళ్ళే లేరు! నా చుట్టూ చేరిన వాళ్ళంతా నా డబ్బు చూస్తే సెటలైట్స్‌లా తిరుగుతారు. ఎందుకో మిమ్మల్ని చూసాక చూసినప్పటి నుండీ గమనిస్తూనే వున్నాను. ఎవరితోను మాట్లాడక పోవడం సరి కదా! కన్నెతి చూడక పోవడం, ఎంతసేపూ మీరు, మీ పుస్తకాలతోనే గడిపే మీరు, మీ నడవడి ఆ ప్రవర్తన అన్నీ గమనించాక నాకనిపించింది. మీలాంటి నెమ్మదస్తులే నన్ను సుఖపెట్టగలరని... నా జీవితంలో వెలుగు నింపగలనిపించి. .. మీరే కావాలని కోరుకుంటున్నాను! అది తప్పంటారా? ఏం! నాకు డబ్బు, అంతస్థు, హోదా ఉన్నంత మాత్రానా ఈ చిన్న కోరికకి అనర్హుడినా? అంటూ ఏవేవో కబుర్లు చెప్పాడు. అదంతా నిజమని నమ్మేట్టు చేశాడు. నేను ట్వంటీ సెకండ్ విక్టిం నవుతానని నాకు తెలీదండీ! అతని ఇరవై ఒక్క పాపాలని కడిగేసుకొని నన్ను భార్యలా స్వీకరిస్తానని నమ్మించాడు. నా జాగ్రత్తలో నేనుండక పోవటం నా తప్పే ఒప్పుకుంటాను! అతన్ని నిందించి లాభం లేదు? తప్పంతా నాదేనండి!" అంటూ మళ్ళీ వెక్కివెక్కి ఏడ్చింది! కానీ వాళ్ళిప్పటికయినా నా మానాన నన్ను బ్రతకనిచ్చేట్టు లేరండీ!" అంది ఏడుస్తూనే. ఇక నేను బ్రతక్కూడదండీ! నాలాంటి వాళ్ళసలు బ్రతుక్కూడదు! అంటూ అరచేతితో మొహం కప్పుకొని ఏడుస్తూనే వుంది.

శ్వేత ఓదార్చే ప్రయత్నం చేయలేదు. ఆమె మరీ జాలిగా చూస్తుండిపోయింది. ఆ విజయ్ రాస్కెల్ తన క్లాస్‌మేటే! వాడి చరిత్రంతా తనకు తెలుసు. మొదట తన వెంట కూడా పడ్డాడు. ఇవే డైలాగులు కాస్త మార్చి చెప్పాడు. ప్రేమల దోమల మీద నమ్మకం లేని తను వాడిని తిరస్కరించింది. వాడి బోడి నటనని, వాడి వెకిలి చేష్టలని ధైర్యంగా ఎదుర్కొంది తను! తమ జాతి మొట్టమొదటి లక్షణమే ధైర్యం!! అలాంటప్పుడు వాడి ఆటలెలా సాగుతాయి తనముందు?" లేచి సారికను ఓదార్చింది! ధైర్యంగా వుండమని చెప్పింది! ఎక్కడోలేని ఉపశమనాన్ని అందించింది శ్వేత. అయినా లాభం

లేకుండా పోయింది.

మరో రెండు రోజులకి సారిక ఆత్మహత్య చేసుకున్న సంగతి విని చలించి పోయింది! ఎంత మంది అమ్మాయిల జీవితాల్ని నాశనం చేస్తాడీ రాస్కెల్! ఇలాంటి వాళ్ళని బ్రతకనీయకూడదు. నిలువునా షూట్ చేసి పారేయ్యాలి! మనసులో అనుకుంది శ్వేత. పాపం సారిక!

ఐవిల్ టీచ్ హిమ్ ఎ లెసన్ ఆఫ్ హిస్ లైఫ్ అని నిర్ణయించుకొంది శ్వేత.

వారం రోజులు గమనించింది విజయ్‌ని. అతని ప్రవర్తనలో ఏ మార్పు లేదు! ఎప్పటిలాగే విచ్చల విడిగా డబ్బు ఖర్చు పెడుతూ స్నేహితులతో జల్సా చేస్తూ మరో ఇద్దరమ్మాయిలతో తిరుగుతున్నాడు! శ్వేతకి మండింది. వీడి చేతిలో ఇంకే అమ్మాయి జీవితం నాశనం కానివ్వను! వాడి వెంట తిరుగుతున్న ఆ ఇద్దరు అమ్మాయిలను కూడా కాపాడుతాను అని మనసులో గట్టిగా శపథం చేసుకొంది శ్వేత.

★ ★ ★

బొంబే వెళ్ళి అష్టకష్టాలు పడి తనక్కావల్సిన స్నేహితురాలిని కలిసింది. ఆవిడ ఓ డాక్టర్! కాసేపు ఆ మాట ఈ మాట మాట్లాడుకున్నాక తను వచ్చిన పని చెప్పింది! శ్వేత మాటలు విని ఆ డాక్టర్ అదిరి పడ్డది! కానీ శ్వేత పట్టుదలతో తనకు వచ్చిన సమస్యని సవివరంగా విపులంగా చెప్పింది. ఈ పని వలన కొందరి జీవితాలు బాగుపడ్తాయని దయచేసి కాదనకండని బ్రతిమాలింది. ఇంత దూరం వచ్చి వట్టి చేతులతో పోలేను. ఇది ఎంతో పుణ్యకార్యంగా భావిస్తున్నాను. ఓ ఛీడ పురుగుని చంపేసి కొందరి బ్రతుకులనైనా కాపాడగలననుకుంటున్నాను. దయచేసి కాదనకండి! ఈ చర్య ప్రభావం మీ వరకు ఏ మాత్రం రానివ్వను. అస్సలు మీరు పిక్చర్‌లోనే వుండరు! నాక్కావల్సిన ఐటమ్స్ ఇవ్వండి చాలు! అని పలు విధాల నచ్చ చెప్పింది శ్వేత! ఆ డాక్టర్ కాసేపాలోచించి, 'సరే! నీ మీద నమ్మకంతో సహాయం చేస్తాను! కాని నన్ను మటుకు ఈ ఆపరేషన్‌లో ఇరికించకు! అని మాటివ్వు చాలు! అంది ఆ డాక్టర్! శ్వేత సంతోషించింది. ఆ డాక్టర్‌కి పరిపరి విధాల కృతజ్ఞతలు చెప్పి కావాల్సిన సరంజామాతో తిరిగి వచ్చింది. తను ఆపరేషన్ సిద్ధం చేసుకొని అవకాశం కోసం ఎదురు చూస్తుంది.

★ ★ ★

ఆ అవకాశం రానే వచ్చింది. ఒకరోజు అతని కారు దగ్గర తచ్చాడుతున్నట్టు నటించి ఎలాగోలా తను అంతకు ముందు మెకానిక్‌ని అడిగి తెలుసుకున్న పద్ధతిలో అతి చాకచాక్యంగా, ఎవరికీ తెలీకుండా బ్రేక్ వైర్ తెంపేసింది! హమ్మయ్య ఆపరేషన్‌లో మొదటి స్టేజ్ పూర్తయ్యింది. ఇక....రెండవ స్టేజ్ కొరకు ఎదురు చూడాలి!!'' అనుకుంది శ్వేత!

ఆ రోజు సాయంత్రం విజయ్ కారు డ్రైవ్ చేసుకుంటూ ఇంటికెళ్తున్నాడు. ముందు వెళ్తున్న స్కూటర్‌ని తప్పించుకుంటూ బ్రేక్ వేసాడు. అయినా పడలేదు. కంగారుగా కారుని పక్కకి తిప్పుతూ పక్కనున్న చెట్టుకి గుద్దేశాడు. ఫలితంగా అతనికి స్వల్పంగా గాయాలయ్యాయి

వాటికే హడావిడి చేస్తూ అతన్ని నర్సింగ్ హోంలో చేర్పించారు అతని తల్లిదండ్రులు. ఒకే సుపుత్రుడు కదా! తన ప్లాన్‌లో రెండవ స్టేజ్ కొరకు ఎదురు చూస్తున్న శ్వేత అతన్ని రోజు కలవడానికని హాస్పిటల్ కెళ్ళి వస్తోంది. ఒకరోజు అవకాశం రానే వచ్చింది. నింపాదిగా చాలా పకడ్బందీగా తన ప్లాన్‌లోని రెండవ స్టేజ్ పూర్తి కావించింది. ఇక మూడవ స్టేజ్ రిజల్ట్స్ కొరకు ఎదురు చూడ్డమే!

★ ★ ★★

తన ఆపరేషన్ సక్సెస్ అయిందనడానికి నిదర్శనం విజయ్ రోగం తిరగబడి మరో నెలకి హాస్పిటల్‌లోనే మరణించాడు. అది ప్రయివేట్ నర్సింగ్‌హోం కాబట్టి పోస్టు మార్టమ్ జరిగే ప్రసక్తి లేదు. ఒకవేళ పోస్ట్ మార్టం జరిగితే అతను ఎయిడ్స్ వ్యాధి సోకి మరణించాడని తేల్తుంది. అతని చెడు తిరుగుళ్ళు తెలిసీ ఎవరూ అంతగా ఆశ్చర్యపోలేదు. తల్లిదండ్రులు కూడా పోస్ట్ మార్టమ్‌కి ఒప్పుకోలేదు. పరువు పోతుంది. ఒక వేళ పోస్ట్‌మార్టం కాని జరిగితే అసలు విషయం బయట పడేది.

ఎయిడ్స్ ముదిరిన రోగగ్రస్థుడికి వాడిన ఐదారు ఇంజక్షన్ సిరంజస్, నీడిల్స్ అతనిపై ప్రయోగించబడ్డాయని తేలేది! కాని పోస్ట్ మార్టమ్ జరగలేదు. అతని పాప ఫలితంగానే అతనికి ఎయిడ్స్ సోకిందని అంతా భావించారు. తల్లిదండ్రులు ఆ నర్సింగ్ హోం స్టాఫ్‌కి, డాక్టర్స్‌కి దండిగా డబ్బు ముట్ట చెప్పి గుప్తంగా వుంచుకున్న విషయాన్ని 'ఎక్కడి దొంగలక్కడ గప్‌చుప్' మూలంగా ఎలాంటి ఇన్వెస్టిగేషన్స్ జరగలేదు. ఫలితంగా శ్వేత విశ్రాంతగా వుండిపోయింది. తను అనుకున్న పని జరిగిపోయిందని మురిసిపోయింది.

●

**అవార్డు**

''మీ ధైర్య సాహసాలకు 'అవార్డు' మీకే సందర్భంగా లభించింది'' అడిగాడు ఇంటర్వ్యూ చేసే గుర్నాథం.

''నేను ఒక్కడినే ధైర్యంగా బస్ కండక్టర్ని చిల్లర పది పైసలు ఇచ్చి తీరవలసిందే నని ప్రతిఘటించి సాధించాను'' అన్నాడు సుందరం.

**కట్నం**

''రవి! పెళ్ళి గొప్పదా, ప్రేమ గొప్పదా?'' అడిగింది ప్రియురాలు లత.

''కట్నం గొప్పది ప్రియా'' అని వినయంగా అన్నాడు రవి.

— పురిపి నారాయణమూర్తి

